క్లుప్తంగా

ఇసుక ట్రాక్టర్లు సీజ్

ఏర్పేడు: మండలంలోని కొత్త వీరాపురం వద్ద అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు ఏర్పేడు సీఐ శ్రీహరి గురువారం తెలిపారు. అధికారుల అనుమతి పొందకుండా స్వర్ణముఖి నది నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తే వాహనాలతో సహా సీజ్ చేస్తామని హెచ్చరించారు.

జోరుగా మట్టి రోడ్డు పనులు



తొట్టంబేడు (రేణిగుంట): శ్రీకాళహస్తి మండలం గుంటకిందపల్లె పంచాయతీ అరుంధతివాడలో జోరుగా మట్టి రోడ్డు పనులు చేస్తున్నారు. ఎన్నో ఏళ్లుగా ఈ గ్రామానికి రోడ్డు సౌకర్యం లేదు. ఇటీవల గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఈ ప్రాంతాల్లో పర్యటించిన ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డికి గ్రామస్తులు రోడ్డు సమస్యను నివేదించారు. స్పందించిన ఆయన గ్రామానికి మట్టి రోడ్డు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించడంతో గురువారం గ్రామంలో జేసీబీ, ట్రాక్టర్లతో ఎంపీటీసీ రఘురామరెడ్డి, సర్పంచ్ పెంచలమ్మ పర్యవేక్షణలో రోడ్డు వేశారు. దీనిపై గ్రామస్తులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలియజేశారు.

రోడ్ల పరిశీలన

తొట్టంబేడు(రేణిగుంట): శ్రీకాళహస్తిలోని 34,35 వార్డు సచివాలయాల పరిధిలోని దెబ్బతిన్న కల్వర్టులు, రోడ్లను గురువారం మున్సిపల్ అధికారులు పరిశీలించారు. రానున్న వర్షకాలాన్ని దృష్టిలో ఉంచుకుని వాటికి త్వరలోనే మరమ్మతులు చేయిస్తామని చెప్పారు. బీపీ అగ్రహారం, ఏఎం పుత్తూరు, ఇసుకదిబ్బ, పూలవీధి, శ్రీ సాయిరాంవీధిలో దెబ్బ తిన్న రోడ్లను పరిశీలించారు. కార్యక్రమంలో వర్క్ ఇన్‌స్పెక్టర్ రత్నం, సచివాలయ ఇంజినీరింగ్ సిబ్బంది మౌనిక, సచివాలయ టౌన్ ప్లానింగ్ సెక్రటరీ ప్రభాకర్, మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలకు స్పందన



విప్పమానుపట్టెడలో నిర్వహిస్తున్న క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు

రేణిగుంట: మండలంలోని విప్పమానుపట్టెడ ప్రాథమిక పాఠశాల ఆవరణలో గురువారం టాటా కాన్సర్ ట్రస్ట్ నిర్వహించిన ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలకు మంచి స్పందన లభించింది. దాదాపు వంద మందికి ఈ పరీక్షలు చేశారు. ఈ శిబిరాన్ని గ్రామ సర్పంచ్ లక్ష్మీపతిరెడ్డి ప్రారంభించారు. తమ పంచాయతీలో ఇలాంటి కార్యక్రమం నిర్వహించి వైద్య పరీక్షలు నిర్వహించడం సంతోషకరమని ఆయన అన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ గోవిందరాజులు, టాటా క్యాన్సర్ ట్రస్ట్ వైద్య నిపుణులు, సిబ్బంది పాల్గొన్నారు.

తాటి చెట్టు కూలి రెండు గేదెలు మృతి



కలువాయి: పొలంలో మేతకు వెళ్లిన గేదెలపై తాటి చెట్టు కూలడంతో రెండు గేదెలు అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన కలువాయి మండలం తెలుగురాయపురంలో గురువారం జరిగింది. బాధితుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన రైతు వద్దిబోయిన సుబ్బారెడ్డి తాటితోపులో తన గేదెలను మేపుకునేందుకు తీసుకువెళ్లాడు. సాయంత్రం ఆకాశం మేఘావృతమై స్వల్ప వర్షంతో పాటు బలంగా గాలులు వీచాయి. గాలుల తీవ్రతకు ఓ తాటి చెట్టు కూలిపోయింది. చెట్టు కూలుతున్న విషయం గమనించిన సుబ్బారెడ్డి పక్కకు తప్పుకుని ప్రాణాలు కాపాడుకోగా గేదెలపై చెట్టు కూలి పోవడంతో అవి మరణించాయి. గేదెల విలువ రూ. లక్ష ఉంటుందని రైతు తెలిపారు.

చాటింపునకు ముందే అంబళ్లు పోయండి

సూళ్లూరుపేట: పట్టణంలో ఉన్న చెంగాళమ్మ బ్రహ్మోత్సవాలకు మొదటి చాటింపు వేయకముందే అమ్మవారికి అంబళ్లు పోసే కార్యక్రమానికి శుక్రవారం నుంచే శ్రీకారం చుట్టాలని ఆలయ చైర్మన్ దువ్వూరు బాలచంద్రారెడ్డి, ఈఓ ఆళ్ల శ్రీనివాసులురెడ్డి సూచించారు. గురువారం ఉదయం నుంచి పట్టణంలో ప్రచారం కూడా చేస్తున్నామన్నారు. శుక్రవారం సూళ్లూరు, ఇందిరానగర్, ఝాన్సీనగర్, బజారువీధికి చెందిన వారు అంబళ్లు పోయాలని కోరారు. ఆదివారం గాండ్లవీధి, సాయినగర్, మహా దేవయ్యనగర్, రాఘవయ్యపేట, కోళ్లమిట్ట, ఇసుకమిట్ట ప్రాంతాల్లో, మంగళవారం కస్వారెడ్డిపాళెం, దేగలపాళెం, బాపూజీకాలనీ, రాజీవ్‌నగర్ ప్రాంతా లకుచెందిన వారంతా అంబళ్లు పోయాలని కోరారు.

31 నుంచి కల్యాణ వెంకన్న బ్రహ్మోత్సవాలు

- ఏర్పాట్లపై అధికారులతో జేఈఓ వీరబ్రహ్మం సమీక్ష



అధికారులతో సమీక్షిస్తున్న జేఈఓ వీరబ్రహ్మం

నారాయణవనం: పద్మావతి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలను ఈ నెల 31న బుధవారం నుంచి జూన్ 8 గురువారం వరకు వైభవంగా నిర్వహించడానికి అందరూ సమష్టి కృషి చేయాలని జేఈఓ వీరబ్రహ్మం ఆదేశించారు. బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై గురువారం సాయంత్రం ఆయన ఆలయంలో వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. పోస్టర్లను ఆవిష్కరించి మీడియాతో మాట్లాడారు. పద్మావతి అమ్మవారి జన్మస్థలమైన నారాయణవనంలో బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహిస్తామన్నారు. బ్రహ్మోత్సవాల్లో జూన్ 4న గరుడ వాహనం, 7న రథోత్సవం, సాయంత్రం ఆర్జిత కల్యాణోత్సవం నిర్వహిస్తామని, ఉత్సవాల్లో ప్రతి రోజూ ఉదయం 7.30 నుంచి 9.30 గంటల వరకు, రాత్రి 7 నుంచి 8.30 గంటల వరకు వాహన సేవలు నిర్వహించడానికి తగిన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు . గరుడ వాహనం, రథోత్సవం, స్వామివారి కల్యాణోత్సవానికి హాజరయ్యే భక్తులను దృష్టిలో ఉంచుకుని ఎలాంటి ఇబ్బందులకూ తావివ్వకుండా ఏర్పాట్లు, వసతులు కల్పించాలన్నారు. ఈరెండు రోజులు భద్రత, వైద్య సేవల పరంగా ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. వాహనాలు, రథం స్థితిగతి ఎలా ఉందో పరిశీలించాలని, ఆలయంతో పాటు పరిసరాల్లో పిచ్చిమొక్కలు తొలగించి శుభ్రం చేయాలన్నారు. ఘటాటోపం, ఆలయంలో రంగవల్లులు, విద్యుత్ అలంకరణలు ఆకట్టుకునేలా చేయాలన్నారు. భక్తులకు సౌకర్యంగా ఉండేలా సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. బ్రహ్మోత్సవాలకు సంబంధించిన ఎస్వీబీసీలో చానల్‌లో ప్రొమోలు ప్రసారం చేయాలని సూచించారు. ఆంజనేయస్వామి ఆలయం పక్కన ఉన్న బావిని, వాటర్ ట్యాంకు శుభ్రం చేయాలని, పుష్కరిణిలో చెత్తను తొలగించాలన్నారు. టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్, అన్నమాచార్య ప్రాజెక్టు, దాససాహిత్య ప్రాజెక్టుల ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక, భక్తి సంగీత కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సమీక్షలో టీటీడీ ఎస్ఈలు సత్యనారాయణ, వెంకటేశ్వర్లు, రవాణా విభాగం జీఎం శేషారెడ్డి, డెప్యూటీ ఈఓ నాగరత్న, డీఎఫ్ఓ శ్రీనివాస్, వీజీఓ మనోహర్, ఈఈ మనోహర్, డిప్యూటీ ఈఈ రాఘవయ్య, సీనియర్ మెడికలాఫీసర్లు డాక్టర్ నర్మద, డాక్టర్ కుసుమ కుమారి తదితరులు పాల్గొన్నారు.

ఎయిర్‌పోర్ట్ డైరెక్టర్‌కు సన్మానం



బసవరాజు

రేణిగుంట: తిరుపతి ఎయిర్‌పోర్ట్ ఇన్‌చార్జి డైరెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన బసవరాజును గురువారం ఎయిర్‌పోర్ట్ టాక్సీ యూనియన్ నాయకులు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఇక్కడ పనిచేస్తున్న రాజ్‌కిషోర్ ఉద్యోగోన్నతిపై హైదరాబాద్‌కు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో తిరుపతి ఎయిర్‌పోర్ట్‌లో ఇంజినీరింగ్ అండ్ ఎలక్ట్రికల్ విభాగంలో జాయింట్ జీఎంగా పనిచేస్తున్న బసవరాజును ఇన్‌చార్జి ఎయిర్‌పోర్ట్ డైరెక్టర్‌గా నియమించారు. దీంతో ఆయన్ను టాక్సీ యూనియన్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. అలాగే నూతనంగా ఎయిర్‌పోర్ట్ సీఐఎస్ఎఫ్ కమాండెంట్‌గా బాధ్యతలు స్వీకరించిన కున్వర్ బహదూర్‌ను కూడా వారు సత్కరించారు. టాక్సీ యూనియన్ నాయకులు షఫీ, రిజ్వాన్, నందకుమార్, నూరుల్లా, షాను, నవీన్, దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

సప్తగిరి బ్యాంకు మేనేజర్‌గా దినేష్



ఏర్పేడు: స్థానిక సప్తగిరి గ్రామీణ బ్యాంకు మేనేజరుగా టీ.దినేష్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ మేనేజర్‌గా పనిచేస్తున్న విశ్వజ రేణిగుంటకు బదిలీపై వెళ్లారు. తిరుపతి జోనల్ ఆఫీస్ నుంచి దినేష్ ఇక్కడికి బదిలీపై వచ్చారు. రైతులు, ఖాతాదారులకు సకాలంలో పంట, బంగారు రుణాలు అందజేస్తామన్నారు. బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

విద్యార్థుల నమోదు పెంపునకు కృషి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ రవి

సత్యవేడు: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెంచేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంఈఓ కే.రవి కోరారు. గురువారం ఎంఆర్సీ కార్యాలయంలో నాడు-నేడు పనులు, పాఠశాలల వసతులపై ప్రధానోపాధ్యాయులు, సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, సీఆర్పీలకు సమావేశం నిర్వహించారు. ఎంఈఓ మాట్లాడుతూ, ప్రభుత్వం కొన్ని రోజుల్లో పాఠశాలల్లో ఏర్పాటు చేయబోతున్న ఇంటరాక్టివ్ ఫ్లాట్‌పానెల్(ఐఎఫ్‌పి) ద్వారా ప్రభుత్వ పాఠశాలల చరిత్రలో నూతన అధ్యాయం ఆవిష్కృతమవుతుందన్నారు. అధునాతన బోధనా పద్ధతుల్లో విద్యాబోధన చేస్తారని పేర్కొన్నారు. నైపుణ్యం కలిగిన ఉపాధ్యాయులు ప్రభుత్వ పాఠశాల్లో ఉన్నారని, ఉచితంగా నాణ్యమైన విద్యను అందిస్తామని, పిల్లల్ని ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని తల్లిదండ్రులకు ఎంఈఓ విజ్ఞప్తి చేశారు. మండలానికి 8 స్మార్ట్ టీవీలు, 46 ఇంటరాక్టివ్ ఫ్లాట్‌పానెల్(ఐఎఫ్‌పి)లు మంజూరయ్యాయన్నారు. కన్నావరం యూపీ స్కూల్‌కు 2, ఇరుగుళం జెడ్పీ హైస్కూల్‌కు 7, బాలుర హైస్కూల్‌కు 9, గురుకుల బాలికల పాఠశాలకు 9, గురుకుల బాలుర ఉన్నత పాఠశాలకు10, మదనంబేడు జెడ్పీ హైస్కూల్‌కు 7, దాసుకుప్పం ఉన్నత పాఠశాలకు 4 చొప్పున ఐఎఫ్‌పీలు మంజూరు చేసినట్లు వివరించారు.స్మార్ట్ టీవీలు, ఐపీఎఫ్‌లు మంజూరైన ప్రధానోపాధ్యాయులు సచివాలయ ఇంజినీర్ల ద్వారా ఎస్టిమేషన్లు రెండు రోజుల్లో వేయించి ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఇరుగుళం క్లస్టర్ ప్రధానోపాధ్యాయుడు మొహిద్దీన్, ఏఈలు దేవి ప్రసాద్, భానుప్రకాష్, ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీ తనిఖీ



సమావేశంలో మాట్లాడుతున్న హర్షవర్ధన్

ఏర్పేడు: మండలంలోని పాపానాయుడుపేట పీహెచ్‌సీని గురువారం తజిల్లా మైక్రోలెవెల్ మానిటరింగ్ అధికారి హర్షవర్ధన్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ, వికృతమాల సచివాలయంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించి పిల్లల ఆధార్ ఐడీలు అప్‌డేషన్ చేయాలన్నారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన ఫ్యామిలీ ఫిజిషియన్ సేవలను గ్రామీణులు సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు అభిజ్ఞ, సాయిహరిణి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అనధికారిక లేఅవుట్లకు అనుమతులు ఇవ్వలేం



బత్తలవల్లం పద్మావతి లేఅవుట్‌లో ఫిర్యాదుదారునితో విచారణ చేస్తున్న ఎంపీడీఓ

- 'జగనన్నకు చెబుదాం'లో అందిన ఫిర్యాదుపై ఎంపీడీఓ స్పష్టం

వరదయ్యపాళెం: మండలంలోని బత్తలవల్లం గ్రామ పంచాయతీ పరిధిలో అనధికారికంగా ఉన్న పద్మావతి లేఅవుట్‌లో భవన నిర్మాణానికి అనుమతులు ఇవ్వలేమని బాధిత ఫిర్యాదుదారునికి ఎంపీడీఓ సుబ్రమణ్యం రాజు తేల్చి చెప్పారు. సంబంధిత లేఅవుట్‌లో స్థలం కొనుగోలు చేసిన రాజేంద్ర 'జగనన్నకు చెబుదాం'కు ఫిర్యాదు చేశారు. స్పందించిన ఎంపీడీఓ గురువారం సంబంధిత పద్మావతి లేఅవుట్‌ను, రికార్డులను, ఫిర్యాదుదారుడు రాజేంద్ర వద్ద ఉన్న వివరాలను పరిశీలించడంతో అది అనధికారిక లేఅవుట్‌గా తేలింది. ఇక్కడ భవన నిర్మాణ అనుమతులు ఇవ్వలేమని ఎంపీడీఓ స్పష్టం చేసి ప్రభుత్వానికి నివేదించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ విజయకుమారి, వరదయ్యపాళెం పంచాయతీ ఈఓ బసిరెడ్డి, బత్తలవల్లం పంచాయతీ కార్యదర్శి పద్మనాభరాజు పాల్గొన్నారు.

మృతుడు కుమారస్వామిరెడ్డిగా గుర్తింపు



కుమారస్వామి రెడ్డి (ఫైల్)

ఏర్పేడు: మండలంలోని బాలకృష్ణాపురం వద్ద రైల్వే పట్టాలపై బుధవారం రాత్రి మృతి చెందిన వ్యక్తి కుమారస్వామిరెడ్డిగా గుర్తించినట్లు రేణిగుంట రైల్వే పోలీసులు గురువారం తెలిపారు. వారు తెలిపిన వివరాలు..మండలంలోని మోదుగులపాలెం పంచాయతీ సిద్దయ్యగుంటకు చెందిన కుమారస్వామిరెడ్డి(65)బుధవారం సాయంత్రం ఏర్పేడుకు స్వంత పనుల నిమిత్తం వెళ్లాడు. పనులు ముగించుకుని స్వగ్రామానికి వెళ్లేందుకు బుధవారం రాత్రి కాలినడకన బాలకృష్ణాపురం సమీపంలో రైల్వే పట్టాలు దాటుతుండగా తిరుపతి నుంచి శ్రీకాళహస్తి వైపు వెళుతున్న రైలు ఢీకొంది. ఈ ప్రమాదంలో కుమారస్వామిరెడ్డి అక్కడికక్కడే మృతి చెందాడు. శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రిలో పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

రేపటి నుంచి 'మేరా లైఫ్..మేరా స్వచ్ఛ నగర్'

- మున్సిపల్ కమిషనర్ బాలాజీ నాయక్

తొట్టంబేడు (రేణిగుంట): శ్రీకాళహస్తి పురపాలక సంఘంలో పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా 'మేరా లైఫ్..మేరా స్వచ్ఛ నగర్' కార్యక్రమం శనివారం నుంచి నిర్వహించనున్నామని మున్సిపల్ కమిషనర్ బాలాజీ నాయక్ తెలిపారు. గురువారం తన కార్యాలయంలో ఆయన మాట్లాడారు. మే 20 నుంచి జూన్ 5 న పర్యావరణ దినోత్సవం వరకు ఈ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. పట్టణ ప్రజలు తమ వద్ద ఉన్న పనికిరాని పాత పుస్తకాలు, బట్టలు, చెప్పులు, ప్లాస్టిక్ వస్తువులు, డబ్బాలు , మొదలయిన వస్తువులను తమ సమీప కేంద్రాల్లో అందజేస్తే, వాటిని అవసరమున్న ఇతరులకు అందజేస్తామన్నారు. క్లస్టర్ కు ఒక్క కేంద్రం చొప్పున ప్రజలకు సౌకర్యార్థంగా పోలీస్ క్వార్టర్స్ సచివాలయం, బాబు అగ్రహారం స్కూల్, జయరామారావు సచివాలయం, బాలాజీ నగర్ సచివాలయంలో వీటిని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

నేడు సామాజిక తనిఖీ బహిరంగ సభ

వరదయ్యపాళెం: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పథకానికి సంబంధించి 2022-23 మార్చి వరకు చేసిన పనులకు సంబంధించి సామాజిక తనిఖీ బహిరంగ సభ శుక్రవారం ఉదయం 10 గంటలకు స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సుబ్రమణ్యం రాజు ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉపాధి సిబ్బంది, కూలీలు హాజరు కావాలని కోరారు.

పేదలంటే ఎందుకంత కక్ష నీకు?



నారాయణవనంలో నిరసన తెలుపుతున్న సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం

- చంద్రబాబుపై సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం ఫైర్

నారాయణవనం: రాష్ట్రంలో పేదలకు ఇంటి స్థలాలను ఇవ్వడం చంద్రబాబుకు ఇష్టం లేకనే అడుగడుగునా అడ్డు తగులుతున్నారని సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అన్నారు. గురువారం సాయంత్రం పార్టీ నాయకులతో కలిసి నారాయణవనంలోని బైపాస్‌లో వైఎస్సార్ సర్కిల్ వద్ద చంద్రబాబుకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆదిమూలం మీడియాతో మాట్లాడుతూ పేదలకు ఇంటి స్థలాల పంపిణీ కోసం చేపట్టిన భూసేకరణపై టీడీపీ అండ్ కో కోర్టుకు వెళ్లడంతో ఏడాది పాటు ఆలస్యమైందన్నారు. అమరావతిలో పేదలకు ఇళ్లిస్తే సామాజిక అసమానత్వం వస్తుందని చంద్రబాబు మాట్లాడడం దారుణమని, పేదలంటే అతని బానిసలు కాదన్నారు. టీడీపీ రాజకీయం పేదలు, బహుజనులకు వ్యతిరేకంగా సాగుతోందన్నారు. దేశంలోనే మరెక్కడా లేని విధంగా పేదలకు సొంతింటి కలను నెరవేస్తూ సీఎం జగనన్న రాష్ట్రవ్యాప్తంగా లక్షల మంది మహిళలకు ఇంటి స్థలాలను ఇచ్చి వారి హృదయాల్లో స్థానం పొందితే, కానీ చంద్రబాబు మాత్రం తన ఉనికిని కోల్పోతానన్న భయంతో మతి భ్రమించి వ్యవహరిస్తున్నారని అన్నారు. వచ్చే ఎన్నికల్లో చంద్రబాబుకు ఘోర పరాజయం తప్పదన్నారు. నిరసన తెలిపిన వారిలో ఎంపీపీ దివాకర్‌రెడ్డి, పార్టీ నాయకులు కోనేటి బాబు, ఏకాంబరం, అన్నాదొరై, ఊరప్ప, చిన్నదొరై, మనోహర్, సొరకాయలు, మోహన్, అశోక్, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఆశా వర్కర్లకు నియామక పత్రాలు



ఆశావర్కర్‌కు నియామక పత్రం ఇస్తున్న ఎమ్మెల్యే

నారాయణవనం: మండలంలోని నాలుగు సచివాలయాల్లో ఆశా వర్కర్లను నియమిస్తూ జిల్లా వైద్యశాఖ అధికారులు జారీ చేసిన నియామక పత్రాలను సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అందజేశారు.నారాయణవనం-1, 2, కీళగరం, కొండలచెరువు సచివాలయాలకు కొత్తగా ఎంపికైన ఆశా వర్కర్లు రేఖ, మంజుల, రమ్య, కవితకు గురువారం ఉదయం ఆయన వీటిని అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలను కల్పించి ఘనత సీఎం జగనన్నకే దక్కిందన్నారు. మెరుగైన సేవల కోసం ఏర్పాటైన సచివాలయాలలో యువతను ఉద్యోగులుగా నియమించారని అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ దివాకర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ సుదర్శనరెడ్డి, వైద్యాధికారులు దర్శిత్‌రాజ్, రాగసుధ, సీహెచ్ఓ శ్రీనివాసులు, వైస్ ఎంపీపీ శివశంకర్, డీసీసీబీ డైరెక్టర్ ఊరప్ప, ఎంపీటీసీ సభ్యులు రవి తదితరులు పాల్గొన్నారు.

నిత్యాన్నదాన సత్రానికి స్థలం కేటాయించరూ!

-అంజూరును కోరిన విశ్వ బ్రాహ్మణ సంఘం



అంజూరు శ్రీనివాసులుకు వినతిపత్రం ఇస్తున్న విశ్వ బ్రాహ్మణ సంఘ నేతలు

రేణిగుంట: శ్రీకాళహస్తీశ్వరుని దర్శనార్థం వచ్చే భక్తుల కోసం విశ్వ బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో నిత్యాన్నదాన సత్రం నిర్మాణానికి స్థలం కేటాయించాలని గురువారం విశ్వ బ్రాహ్మణ సంఘ నాయకులు ఆలయ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులును కోరారు. దీనిపై చైర్మన్ స్పందిస్తూ త్వరలో జరగనున్న పాలకమండలి సమావేశంలో చర్చించి స్థల కేటాయింపుపై నిర్ణయం తీసుకుంటామన్నారు. రాష్ట్ర విశ్వ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ సుబ్రమణ్యం ఆచారి, పట్టణ ప్రముఖులు కొండూరు నంద, ఎం.చంద్ర, వెంకటేష్, విశ్వ బ్రాహ్మణ సంఘ నాయకులు వెంకటేష్ ఆచారి, బ్రహ్మయ్య ఆచారి, నాగరాజు, శంకర్ ఆచారి, ఆనంద్ ఆచారి, ప్రసాద్ ఆచారి పాల్గొన్నారు.

ముక్కంటి సేవలో ప్రముఖులు





కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి పండిట్, కుటుంబ సభ్యులతో ప్లీడర్ శ్రీ రజనీరెడ్డి

తొట్టంబేడు (రేణిగుంట): శ్రీకాళహస్తీశ్వర స్వామి ఆలయంలో స్వామి అమ్మవార్లను గురువారం దేవదాయ, ధర్మాదాయ శాఖ గవర్నమెంట్ ప్లీడర్ శ్రీ రజనీరెడ్డి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ప్రత్యేక రాహుకేతు పూజలు చేయించుకున్నారు. అలాగే కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి ఎస్‌జీ పండిట్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. వారికి ఆలయ ఏఈఓ సతీష్ మాలిక్ ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. దర్శనానంతరం గురుదక్షిణామూర్తి సన్నిధి వద్ద స్వామి,అమ్మవారి చిత్రపటంతో పాటు తీర్థప్రసాదాలను అందజేశారు.

త్రైమాసిక పన్ను రద్దు చేయాలని ధర్నా



ధర్నా చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

తిరుపతి మంగళం: రవాణా రంగంపై పెంచిన త్రైమాసిక పన్నును రద్దు చేయాలి సీపీఐ జిల్లా కార్యదర్శి పి.మురళి, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కేతారి రాధాకృష్ణ డిమాండ్ చేశారు. వారు గురువారం ట్యాక్సీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మంగళంలోని తిరుపతి జిల్లా రవాణాశాఖ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. వారు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా రవాణా రంగంపై త్రైమాసిక పన్నును 80 శాతం పెంచడంతో ట్యాక్సీ, ఆటో తదితర వాహనాలపై పెను భారం పడుతోందన్నారు. కరోనా సమయంలో వసూలు చేసిన త్రైమాసిక పన్నును తిరిగి చెల్లించాలని కోరారు. తిరుపతి నగరంలో ఆగివున్న వాహనాల నుంచి అనధికారికంగా వసూలు చేస్తున్న పార్కింగ్ రుసుంను రద్దు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఏఐటీయూసీ నగర ప్రధాన కార్యదర్శి ఎన్‌డీ రవి, కేవై.రాజా, విశ్వనాథ్, శివ, ట్యాక్సీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఆర్‌వీ రమేష్, నగర అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

21 నుంచి గోవిందరాజస్వామి ఆలయ మహా సంప్రోక్షణ

- రేపు మహా సంప్రోక్షణకు అంకురార్పణ
- ఘనంగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం





కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం చేస్తున్న అధికారులు, గోవిందరాజస్వామికి పరదాలు అందజేస్తున్న మణి

తిరుపతి కల్చరల్: ఈ నెల 21వ తేదీ నుంచి 25వ తేదీ వరకు గోవిందరాజస్వామి ఆలయ మహాసంప్రోక్షణ నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. అదేవిధంగా అలాగే గురువారం ఉదయం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా గోవిందరాజస్వామి ఆలయ సన్నిధితోపాటు ఆలయ ఆవరణలోని ఆలయాల పైకప్పు, గోడలు, పూజ సామగ్రి తదితరాలను నీటితో శుద్ధి చేశారు. అనంతరం నాము కోపు, శ్రీచూర్ణం, కస్తూరి పసుపు, పచ్చాకు, గడ్డకర్పూరం, గంధం పొడి, కుంకుమ, కిచిలీగడ్డ తదితర సుగంధ ద్రవ్యాలు కలిపిన జలాలను ఆలయం అంతటా సంప్రోక్షణ చేశారు. శనివారం ఉదయం 7.30 నుంచి 9 గంటల వరకు ఆచార్య రుత్విక్ వరణం నిర్వహిస్తారు. సాయంత్రం 6.30 నుంచి రాత్రి 8.30 గంటల వరకు సేనాపతి ఉత్సవం, మృత్సంగ్రహణం, అంకురార్పణ ఉంటాయి. 21న ఉదయం 8.30 నుంచి 11 గంటల వరకు పుణ్యాహవచనం, రక్షాబంధనం , సాయంత్రం 6 నుంచి 8 గంటల వరకు యాగశాలలో వైదిక కార్యక్రమాలు చేపడతారు. 22న ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జలాధివాసం, బింబస్థాపన, మధ్యాహ్నం 3 నుంచి రాత్రి 8.30 గంటల వరకు మహాశాంతి తిరుమంజనం, యాగశాల కార్యక్రమాలు నిర్వహిస్తారు. 25వ తేదీన ఉదయం 4 నుంచి 7.30 గంటల వరకు కుంభారాధన, నివేదన, హోమం, మహాపూర్ణాహుతి చేపడతారు. తర్వాత 7.45 నుంచి 9.15 గంటల వరకు మిథున లగ్నంలో మహాసంప్రోక్షణ నిర్వహిస్తారు. 10.30 నుంచి భక్తులకు స్వామివారి దర్శనం కల్పిస్తారు. సాయంత్రం 5 నుంచి 6 గంటల వరకు పెద్ద శేష వాహనంపై స్వామివారు ఆలయ నాలుగు మాడ వీధుల్లో విహరించనున్నారు.

పరదాల వితరణ

మహాసంప్రోక్షణ, స్వామి బ్రహ్మోత్సవాల నేపథ్యంలో తిరుపతికి చెందిన మణి స్వామి గురువారం మూడు పరదాలు వితరణ చేశారు. ఆలయ ఏఈవో రవికుమార్, ప్రధాన అర్చకుడు శ్రీనివాస దీక్షితులు, సూపరింటెండెంట్ మోహన్‌రావు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ధనుంజయులు పాల్గొన్నారు.